క్లుప్తంగా

18న శనిత్రయోదశి పూజలు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని తులసీనగర్ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 18న శని త్రయోదశి సందర్భంగా శని పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శని పూజలకు దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి



ఎమ్మెల్యే కూసుకుంట్లతో భూ నిర్వాసితులు

మర్రిగూడ : మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఖుదభాక్షపల్లి, శివన్నగూడ భూ నిర్వాసితులు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, శివన్నగూడ ఎంపీటీసీ దాసరి మమతగోపాల్, ఐతగోని జంగయ్య, చాపల రవి, వెంకన్న, బలరాం, అబ్బయ్య, వెంకటయ్య, భాగ్యమ్మ, రాములు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూడిద లింగయ్య, డాక్టర్ తోట నర్సింహాచారి, బీసీ యువజన కార్యదర్శి పానుగంటి విజయ్, బూడిద మల్లికార్జునగౌడ్, ఆనగంటి కృష్ణ, గుంటోజు వెంకటాచారి, బాలరాజుగౌడ్, స్వామి, యాదయ్య, నర్సింహ ఉన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



సైన్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ

కేతేపల్లి : విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తుంగతుర్తి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.కృష్ణ అన్నారు. సైన్స్ డేను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బండపాలెం గ్రామంలో జ్ఞానదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటల పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుని సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు కె.ప్రభాత్, కె.వీరేష్, సీహెచ్.అశోక్, జిల్లా దానేలు, విక్రం, భాను, సిద్ధు, కిరణ్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో ఇతరులను కలిపితే ఉద్యమిస్తాం

మిర్యాలగూడ : రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో ఎస్టీ కులం జాబితాలో ఇతర కులాలను కలిపే తీర్మానం చేసి కేంద్రానికి పంపడం దారుణమని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధనావత్ సిద్ధునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటికి తండాలు సరైన సదుపాయాలు లేవని, కొన్ని తండాల్లో కూడు, గుడ్డ లేకుండా అనేక మంది గిరిజనులు జీవించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలకు రిజర్వేషన్ అమలు చేయకుండా, పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కాగా ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేరిస్తే ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనావత్ చందునాయక్, సంఘం నాయకులు ఆడావత్ రామునాయక్, ఇస్లావత్ శివనాయక్, నాగరాజునాయక్, చంటినాయక్, కిరణ్‌నాయక్, మునినాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సిద్ధునాయక్

‘కంటి వెలుగు’ కొందరికేనా !

- కంటి చూపు సమస్య ఉన్నా అద్దాలు ఇవ్వడం లేదంటున్న బాధితులు
- ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు
- ఉన్నతాధికారుల ఆదేశానుసారం పనిచేస్తున్నామంటున్న సిబ్బంది

మునుగోడు : కంటి చూపు సమస్య కలిగిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు, మందులు, శస్త్ర చికిత్స చేసేందుకు రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. కార్యక్రమంలో భాగంగా మునుగోడు మండలంలో గత నెల 19వ తేదీ నుంచి 18 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షలు చేస్తున్నారు. కానీ పరీక్షల అనంతరం అవసరమైన వారందరికీ కంటి అద్దాలు ఇవ్వడం లేదు. రోజుకు దాదాపు 120 మందికి పరీక్షలు చేస్తే అందులో కేవలం 15 నుంచి 20 మందికి మాత్రమే అద్దాలు ఇస్తున్నారు.

పరీక్షలు చేసింది 3599 మందికి, ఇచ్చింది 571 మందికి మాత్రమే..

మండలవ్యాప్తంగా మొత్తం 26 గ్రామాల్లో దాదాపు 48వేలకు పైగా జనాభా ఉండగా అందులో 18 ఏళ్లు పైబడినవారు దాదాపు 30వేల వరకు ఉన్నారు. వారందరికీ కంటి పరీక్షలు చేసేందుకు అధికారులు మండలంలో రెండు టీమ్‌లను ఏర్పాటుచేశారు. ఒక్కో టీమ్ సభ్యులు రోజుకు 120 మందికి తగ్గకుండా పరీక్షలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే 5 గ్రామాల్లోని ప్రజలకు పరీక్షలు పూర్తిచేయగా



మునుగోడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మరో 2 గ్రామాల్లో శిబిరాలు కొనసాగిస్తున్నారు. 7 గ్రామాల్లో ఇప్పటివరకు మొత్తం 3599 మందికి పరీక్షలు చేయగా, అందులో 571 మందికి మాత్రమే కంటి అద్దాలు ఇచ్చారు. మరో 368 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని గుర్తించారు. మిగిలిన 2660 మందికి మందులు ఇచ్చి పంపించారు. గతంలో తాము ప్రైవేటు ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేయించుకుంటే అద్దాలు ఇచ్చారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని శిబిరాల వద్ద వైద్యులపై కొందరు తగువులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. ఆ ప్రజాప్రతినిధులు శిబిరం నిర్వాహకులను గట్టిగా ప్రశ్నిస్తే.. రోజుకు కొంతమందికి మాత్రమే అద్దాలు ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారని, ఏ రోజైనా సంఖ్య పెరిగితే తమను ప్రశ్నిస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కంటి చూపు సమస్య ఉన్నవారందరికీ కంటి అద్దాలు అందేలా చూడాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

రోజుకు 20 మందికే ఇచ్చారు



మా గ్రామంలో కంటి వెలుగు శిబిరం నిర్వహించినప్పుడు రోజుకు 100 మందికి పైగా పరీక్షించి 20 మందికి మాత్రమే అద్దాలు ఇచ్చారు. కొందరు తమకు అద్దాలు ఇవ్వడం లేదని మా వద్దకు వచ్చి మొరపెట్టుకున్నారు. గతంలో కంటి అద్దాలు వాడినవారికి సైతం ఇవ్వలేదు. మా గ్రామంలో మొత్తం 334 మందికి పరీక్షలు చేస్తే 50 మందికి మాత్రమే అద్దాలు ఇచ్చారు.

–సురిగి చలపతి, ఎల్లలగూడెం సర్పంచ్

అవసరమైన వారికి అద్దాలు ఇస్తున్నాం

కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారిలో ఎవరికైతే అద్దాలు అవసరం ఉంటుందో వారందరికీ అద్దాలు ఇస్తున్నాం. 65 ఏళ్లు పైబడినవారికి అద్దాలు పనిచేయని కారణంగా ఇవ్వడం లేదు. అద్దాల కొరత ఏ మాత్రం లేదు. ఇటీవలే జిల్లా వైద్యాధికారి, స్థానిక ఎమ్మెల్యేలు అవసరమైన వారందరికీ అద్దాలు ఇవ్వాలని ఆదేశించారు. కంటి పరీక్షల అనంతరం అద్దాలు అవసరమని డాక్టర్లు సూచిస్తే అద్దాలు ఇస్తున్నాం.

–డాక్టర్ జమీర్, మండల వైద్యాధికారి

జాబ్ మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు

నకిరేకల్ : ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాను శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ వేముల వీరేశం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి నిరుద్యోగులకు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పేద విద్యార్థులకు అండగా ఉండడమే ఉద్దీపన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, కట్టంగూరు ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, కంచర్ల కృష్ణారెడ్డి, వంటెపాక యేసు రత్నం, యానాల లింగారెడ్డి గుత్తా మాధవరెడ్డి, గాదగోని కొండయ్య, కొండ వెంకన్న, వెంకటేశ్వర్లు, మాద యాదగిరి, బొజ్జ సుందర్, నకిరేకంటి నరేందర్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, యాసారపు వెంకన్న, చౌగోని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాను ప్రారంభిస్తున్న నేతి విద్యాసాగర్

1024 మంది ఎంపిక

నకిరేకల్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 6 వేల పైచిలుకు నిరుద్యోగులు వివిధ కేటగిరీ ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని హాజరయ్యారు. వీరిలో 1024 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రం నుంచి వావిళ్లపల్లి గ్రామ శివారు వరకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఫ్లడ్ డ్యామేజ్ ఫండ్ (ఎఫ్‌డీఎఫ్) నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో రోడ్డుకు మొరంను పోసి, చదును చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పనున్నాయి.



గట్టుప్పల-వావిళ్లపల్లి రోడ్డు

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

కట్టంగూర్ : రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య, ఆరోగ్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 5లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, మండల అధ్యక్షుడు నూకల సుధాకర్‌రెడ్డి, దళితమోర్చ జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, పసుల సైదులు, పులకం శంకర్, పబ్బు వెంకన్న, నర్సింగ్ సుధాకర్, బొమ్మగాని నాగరాజు, బొడ్డుపల్లి అంజనేయులు, కారంపూడి సాయి, నాగరాజు ఉన్నారు.

కేతేపల్లి : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ పార్టీలకు చెందిన 200 మంది నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని మోదీ అభివృద్ధి పితామహుడని, దేశాన్ని ప్రగతిపథంలో అగ్రగామిగా నిలిపిన దార్శనిక పాలకుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టి.నర్సింహాచారి, వి.నాగయ్య పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బూర నర్సయ్యగౌడ్

మాండ్ర గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : మండలంలోని మాండ్ర గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాండ్ర గ్రామంలో స్థానిక సర్పంచ్ దొండ సామ్యరమేష్‌తో కలిసి పర్యటించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు అన్నీ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. అన్నీ కాలనీల్లో డ్రెయినేజీలు కూడా నిర్మిస్తామన్నారు. అనంతరం ఎంపీపీ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ సామ్యరమేష్‌లను స్థానికులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేతరాజు రమేష్, మాజీ ఉప సర్పంచ్ తరాల శ్రీశైలం యాదవ్, గురజారాములు, గుండె రవి, అనిత, రామలింగం, లింగస్వామి, వడ్డేపల్లి లింగయ్య, పంగ రాములు, అల్లాస్, మహేష్ తదితరులు ఉన్నారు.


ప్రమాదకరంగా పైప్‌లైన్ గుంత

శాలిగౌరారం : మండలంలోని గురుజాల గ్రామ ప్రధాన కూడలి అయిన తుడిమిడి క్రాస్‌రోడ్డు వద్ద తాగునీటి పైపులైన్ మరమ్మతు కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. రోజులు గడుస్తున్నా గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు నిత్యం గుంతవద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. మూసీనదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయి అప్రోచ్ రోడ్డు పనులు వేగంగా జరుగుతుండడంతో శాలిగౌరారం మండలం నుంచి అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు రాకపోకలు పెరిగాయి. దీంతో మూసీనది బ్రిడ్జి పైనుంచి వెళ్లే వాహనదారులు గురుజాలలోని తుడిమిడి క్రాస్‌రోడ్డు నుంచే వెళ్లాల్సి వస్తోంది. క్రాస్‌రోడ్డు కావడంతో వాహనదారులకు అత్యంత దగ్గరకు వచ్చేవరకు గుంత కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని పైప్‌లైన్ గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గురుజాలలో తుడిమిడి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న తాగునీటి పైప్‌లైన్ గుంత

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఎక్స్‌క్లూజివ్ స్టార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సేవానాయక్

మిర్యాలగూడ అర్బన్ : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ మాలోతు సేవానాయక్‌కు మో ఆర్ట్ ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ఎక్స్‌క్లూజివ్ స్టార్ అవార్డు-2023ను ప్రదానం చేశారు. హైదరాబాద్ నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ చైర్మన్ శ్రీనివాస్ అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సాధించిన సేవానాయక్ యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గిరిజన తండాల్లోని విద్యార్థులకు ఆంగ్ల భాషపై మెళకువలు నేర్పి పరిజ్ఞానాన్ని మెరుగుపర్చడంలో విశేషంగా కృషి చేస్తున్నందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఉపాధ్యాయుడు సేవానాయక్‌కు అవార్డు దక్కడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, యూత్ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

అథ్లెటిక్స్‌లో దామరచర్ల విద్యార్థికి వెండి పతకం

మిర్యాలగూడ : బీహార్ రాష్ట్రం పాట్నాలోని పాటలీపుత్ర స్టేడియంలో నిర్వహిస్తున్న నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో దామరచర్లకు చెందిన కందుల యశ్వంత్‌రెడ్డి వెండి పతకాన్ని సాధించారు. ఆదివారం నిర్వహించిన అండర్-16 విభాగం 80మీటర్ల పరుగుపందెంలో యశ్వంత్ ప్రతిభ కనబరిచి వెండి పతకం పొందాడు. స్థానికంగా పదో తరగతి విద్యనభ్యసిస్తున్న యశ్వంత్‌రెడ్డి రన్నింగ్‌పై ఆసక్తి ఉండడంతో కోచ్ గడపరాజు శిక్షణ ఇచ్చారు. అండర్-16 విభాగంలో నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసే ఈవెంట్‌కు పంపింది. యశ్వంత్‌రెడ్డి పతకం సాధించడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అధ్వానంగా బిల్లంకానిగూడెం రోడ్డు

- రోడ్డుకు ఇరువైపులా కమ్మేసిన కంపచెట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కంకర తేలి అధ్వానంగా ఉన్న బిల్లంకానిగూడెం రోడ్డు

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధి బిల్లంకానిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు కంకరతేలి అధ్వానంగా తయారైంది. దారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగి అల్లుకుపోవడంతో ఆ దారిగుండా వెళ్లే క్రమంలో గ్రామస్తులు, వాహనదారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కట్టంగూర్‌లోని అంబేద్కర్‌నగర్ నుంచి బిల్లంకానిగూడెం గ్రామానికి నిత్యం వందలాది మంది ప్రజలు, మండల కేంద్రానికి చెందిన రైతులు, గీతకార్మికులు వ్యవసాయబావుల వద్దకు రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రం నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు జంకుతున్నారు.

కమ్మేసిన కంపచెట్లు

రహదారికి రెండు సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో బాటకు ఇరువైపులా కంపచెట్లు అల్లుకుని మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు పొడవునా కంకర తేలడంతో నడవడానికి కూడా వీల్లేకుండా పోయింది. ప్రజలు అవస్థల పాలవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

కంకరతేలి రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రహదారికి ఇరువైపులా కంపచెట్లు అల్లుకుపోవడంతో మా గ్రామానికి పాఠశాల బస్సులు, ఆటోలు రావడంలేదు. విద్యార్థులు సైకిళ్లపై వెళ్లడానికి జంకుతున్నారు. మండల కేంద్రానికి చెందిన ప్రజలు, రైతులు నిత్యం ఈ దారిగుండానే వ్యవసాయ బావుల వద్దకు వెళతారు. అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డుగా మార్చి సమస్యను పరిష్కరించాలి.



- ఎల్క నర్సింహ, బిల్లంకానిగూడెం

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

నల్లగొండ టౌన్ : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించడానికి మోడల్ టెస్టులు దోహదపడతాయని టూటౌన్ ఎస్‌ఐ సంపత్‌కుమార్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఆర్ ప్రీమియర్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన మోడల్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు మార్చిలో జరిగే పరీక్షలకు మోడ్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు పుచ్చకాయల నర్సిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, మహేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, బిట్టు, రేణుక, అనిల్, వేణు, గణేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మోడల్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

చకిలం జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చకిలం అనిల్‌కుమార్

నల్లగొండ టూటౌన్ : దివంగత ఎమ్మెల్యే చకిలం శ్రీనివాసరావు శత జయంతి వేడుకలను ఈ నెల 20న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చకిలం అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం నల్లగొండలోని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చకిలం అనిల్‌కుమార్ మాట్లాడారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మనవడు ప్రభాకర్‌రావు, కేరళ ఐజీ నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. అన్నదానం, రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చకిలం అభిమానులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శతజయంతి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో సునీల్‌కుమార్, రమేష్, భిక్షపతి, సయ్యద్‌ఫిరోజ్ , సైదులు, రంజిత్‌కుమార్, భిక్షం, పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్ : గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈదులూరు సర్పంచ్ ఐతగోని నారాయణగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఈదులూరు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇమేజ్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు 250 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కీళ్ల వైద్య నిపుణులు గుడారు జగదీశ్, కార్తీక్, జనరల్ ఫిజీషియన్ బ్రహ్మతేజ, అనంతకుమార్, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నిధుల కేటాయింపులో ప్రభుత్వం విఫలం

మునుగోడు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కేటాయించడంలో విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ అన్నారు. ఆదివారం మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అర్హులైనవారికి తెల్లరేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎండీ జహంగీర్, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఉప్పునూతల రమేష్, కాయితి వెంకన్న, సంఘం మండల నాయకులు దుబ్బ వెంకన్న, గోస్కొండ మారయ్య, బొలుగురు ఎల్లయ్య, ప్రసాద్, ఉప్పునూతల సునీల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల : మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన మూడుదుడ్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం ప్రతినిధులు సేకరించిన రూ.75 వేలను ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడుదుడ్ల శేఖర్, మూడుదుడ్ల రామకృష్ణ, వేణు, ఉపేందర్, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన చెవుగోని శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెనగోని సతీష్, మిట్టపల్లి శివ, ఐతగోని నర్సింహ, చెరుకు శ్రీను, చెరుకు రామన్న ఉన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండల ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యుడు దార వెంకన్న ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో తోటి యూనియన్ సభ్యులు తమవంతుగా ఆదివారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు మర్రి యాదగిరి, ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, కోశాధికారి అజయ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పర్ని శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బోడ వెంకన్న, ప్రచార కార్యదర్శి వీర కుమార్ ఉన్నారు.



చిట్యాల : నగదు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) రూ.5 లక్షలు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ రమేష్ తెలిపారు. గతంలో దివంగత రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి నిధులు రూ.5 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. ఆ నిధులు సరిపోకపోవడంతో అసంపూర్తిగా పనులు నిలిచిపోయాయి. మంజూరైన ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో భవనం దాదాపు పూర్తవుతుందన్నారు.



అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయం